స్కెచ్

# ఆశా నిరాశా వాదులు

వల్లూరి కృష్ణారావు

"ఏమో! రోజులు వెళ్ళబుచ్చడం చాలా కష్టంగా ఉంది. ఏంపూజ చేసానోగాని ఈ ఊబిలో పడ్డాను."

"అదేం అలా అంటున్నావు రామం. ఈవేళ ఒకటవతారీఖు గా! పోనీ నిన్న ఈ మాట అంటే బాగుండును."

"31వ తారీఖే బాగుంటుంది ప్రసాద్. నీకు తెలియదు. ఎంచేతంటావా! 31వ తారీఖైతే రేపు జీతం వస్తుందనే ఉత్సాహంతోనైనా బ్రతకవచ్చు. చూడు ఈవేళ 80 రూపాయలు వచ్చాయి ఖర్చు అయిపోయాయి అనుకునే దానికంటె. ఏదైనా జరిగిపోయింది వర్తమానం కంటె బాగుండడం సహజం. వర్తమానం భవిష్యత్తుకంటె దీనికి ఉదాహరణ మన నేటి జీవితాలు పూర్వపు కాలేజీ జీవితాలకు తేడా."

"ఏమో. నీకు నాకు ఈ విషయంలో పొందిక కుదరనట్లుంది. నీకు సంపూర్తిగా విభిన్నంగా ఆలోచిస్తూన్నాను. నాకు గతం కంటె వర్తమానం ఎంతో తియ్యగా ఉంది. వర్తమానం కంటె భవిష్యత్తు చాలా తియ్యగా ఉంటుందని ఊహిస్తున్నాను. నమ్ముతున్నాను కూడా!"

"మరైతే నీ ఉద్యోగంలో ఉండే ఆనందం అలా నీచేత అనిపిస్తోంది."

"బాగుంది రామం. మాష్టరీ ఉద్యోగం గురించి ఎవరికి తెలియదు గనుక. దీన్నంత హీనంగా మరి దేన్ని చూడదుగదా 'సొసైటీ'! అయినా నా ఉద్యోగాన్ని బట్టి నేనలా అనుకోవటంలేదు. మాష్టరు ఎప్పుడూ తనకు మంచి భవిష్యత్తుందనడు. ఎదుగు బొదుగు లేని గొఱ్ఱెతోక! మరి నువ్వెప్పటికయినా తాసిల్దారవుతావనే ఊహతోనైనా ఆనందంగా ఉండగలవు. అలాటిది మాష్టరుకేదీ?"

"సరిపోయింది. ఫైళ్ళతో కుస్తీ పట్టే గుమాస్తాగాడికి ఆలోచనలకు, ఊహాగానాలకు 'టైమె' క్కడిది. మీరైతే ఏడాదికి ఆర్నెల్లు ఊహించవచ్చు, ఆలోచనలు చేయచ్చు నిద్రపోవచ్చు."

"అయినా ఉద్యోగంతో కొల్చి చెప్పలేదు ఈ మాట అని ముందే చెప్పాను. నువ్వు నీ ఉద్యోగాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడుతున్నట్లుంది."

"మరి దేనిపై?"

"అన్ని విషయాలూ ఆలోచించి, తరిచిచూచుకొని ఆకళింపు చేసుకొని చెబుతున్న మాటలివి."

"ఎలా?"అన్నాడు రామం.

"ఇప్పుడు చెప్పుతున్నా విను. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. నేటి విద్యార్థులసంగతి తీసుకో. మనం చదువుకునేటప్పుడు చచ్చేవాళ్ళం చదవలేక. అవునా ఇప్పుడు చూడు. ఎంతో తేలిక. పరీక్షపత్రం తయారు చేసేవాడు పడేటంత కష్టంకూడా పడ్డు నేటి విద్యార్థి."

"బాగుంది ప్రసాద్! బాగుంది. ఏదోవిద్యార్థులు చదువులు ఆధారంగా తీసుకొని అమాంతంగా ఒక నిర్ధారణకొచ్చి మాట్లాడుతున్నావు. అయితే నే ముందే చెప్పానుగా చదువుకొనేటప్పటి దశ ఎంత చక్కనిద్తో విద్యార్థి యుగం ఏమీ తెలియని పసిపాప దశలో ఉంటుంది అయోమయంగా! అయోమయంలో బాధనేది తెలుస్తుందా వెర్రి నవ్వులు కురిపించడం తప్పితే? విద్యార్థి తన చిన్నప్పటి విషయాలు నెమరకు తెచ్చుకోడు. వర్తమానం గురించి పట్టించుకోడు. భవిష్యత్తునుగురించి ఊహించడు. నువ్వెప్పుడైనా పాతదాన్ని స్ఫురణకి తెచ్చుకొని, వర్తమానాన్ని అర్థంచేసుకుంటూ భవిష్యత్తుని ఊహించే స్థితికి వస్తావో అప్పుడే నరకాన్ని చూస్తావు. అదే ఇప్పటి జీవితం ఏమంటావు?" రామం అని ఆగాడు.

"నేను నాలుగు మాటలు చెపితే ఎనిమిది మాటలు మాట్లాడుతున్నావు రామం. అయినా ఒక్కవిద్యార్థిని ఉదాహరణగా తీసుకొని మాట్లాడ

టంలేదు. ఇంకా అనేకం ఉన్నాయి. పోనీ నా ఉద్యోగం మాట చూడు. మే మెంతో పూర్వం వారికంటె ఎంతో అదృష్టవంతులం; ఎంచేతంటా వేమో విను. ఇప్పుడు బి. ఏలు ఎకా ఎకీని బి. ఇడీలు అవుతున్నారు. పూర్వం అలా కాదే. సత్యంగార్ని చూడు. ఆయన్నెరుగుదువు కదూ. ఆయన పదేళ్ల 'సెకండరీ'లో 'రాట్'అయి బి.ఇడి. అయ్యారు. కాదంటావా వర్తమానం జరిగినదాని కంటె మంచిదని?"

అప్పుడు రామం అన్నాడు. "ఏదో ఒకవ్యక్తి విషయంతీసుకొని దాన్ని ఒక సిద్ధాంతంగాచెయ్యడం నాకు నచ్చదు ప్రసాద్. ఏమీ అనుకోకు నాలో ఉన్నది నీకు ఉన్నదున్నట్లుచెప్పితే. అయితే నువ్వు చెప్పిన సత్యంగార్నే తీసుకుందాం, ఆయన 'సెకండరీ'లో ఉన్నప్పటి జీవితానికి, ఇప్పటి 'బి. ఇడి' జీవితానికి పోలికుందా? ఆయన అప్పటి జీవితం ఆనందమయం ఇప్పటి జీవితం దుర్భరం. ఆయన జీతం 50 రూపాయలు. ఆయన ఇప్పటి జీతం నూట ఇరువైపయిన రూపాయల మొత్తాన్ని చూస్తున్నావుగాని రూపాయల విలువల మార్పును అర్థం చేసుకోవు;పోనీ అదలాఉంచు,నా ఉద్యోగం తీసుకో. మా తాసిల్దారును చూడు. ఆయన 'క్వాలిఫికేషను' ఏమిటి?

"స్కూలు ఫయినల్" ప్రసాదు నిర్వికారంగా అన్నాడు.

"పోయిందికూడా. ఆయనక్రింద గుమాస్తాగా ఉన్న నేను బి. ఏ. ఆయన ఆ క్వాలిఫికేషనుతోనే గుమాస్తాగా చేరాడు. జవానుద్యోగమయినా ఇచ్చేవారా ఈ రోజుల్లో అయితే? ఏవో కొన్ని విషయాలు మాత్రమే తీసుకొని వాటిని పూర్తిగా సాధారణ విషయాలుగా కల్పించి మాట్లాడు కోవడం నాకు బాగులేదు."

అప్పుడు ప్రసాదు అన్నాడు "కొన్ని విషయాలు మాత్రమే తీసుకోలేదు. చాలా వాటిని చూసి మరీ అన్నాను. అయినా ఏదో జరిగినదాన్ని స్వర్ణయుగంగా భావించి వాటిని నెమరుకు తెచ్చుకొని వర్తమానం జరిగినదానిలా లేదని విచారించి, వర్తమానమే ఇలా ఉంటే భవిష్యత్తు ఇంక ఎలా వుండనూ?—అని వాపోవడం ఏమంత బాగుంది? హృదయ విదారకం తప్పు!"

"అలా అని పెద్దగా తనకుతాను ఊహించుకోవాలంటావు. జరిగిన మధుర ఘట్టాలను మరిచిపోమ్మంటావు నిజంగాని కలల్లా! కదూ! ప్రసాద్?"

"అందులో లాభం ఏముంటుందో నాకు అర్థం కాకుండా వుంది రామం. మా తాతలు అవు నేతులు తాగారు ఇప్పుడు మా మూతులు వాసన చూడండి అంటే..."

"చూడమనలేదు ప్రసాద్! అప్పుడు తాతలు అవునేయి తాగితే ఇప్పుడు మనం కనీసం గేదె నెయ్యయినా తాగకుండా 'డాల్డా' తాగుతున్నామే. అలాటిది మరి మన తర్వాతవాళ్ళు ఏం తాగుతారో తెలియకుండా వుంది."

"అంత తెలుసుకోవలసిన అగత్యమేముంది? జరిగి పోయిన రోజు ఎలానూ జరిగిపోయిందే. జరిగినదాన్ని తిరగ తోడకుండా జరిగిన దానికంటె వర్తమానం మరింత బాగుండేటట్లు చేసుకో!"

"ఎలా అని అడుగుతున్నాను...నువ్వుచెప్పేది కూడా నాకుతెల్సు. నువ్వు అంటావు. జరిగిన దాన్ని స్ఫురణకు తెచ్చుకోకుండా (ఎంచేతంటే బంగారంలాంటిది కనక, వర్తమానంకంటె మంచిదని మనకు తెలుసుగనక, అలాటిరోజులు ఇక ముందు చూడమని మనకు నిర్ధారణే గనక) వర్తమానం లాటిది మరోవాటి భవిష్యత్తు (కూడా!) తప్పితే లేదని అనుకోమంటావుకదూ ప్రసాద్."

"ఏమైనా, వర్తమానం భవిష్యత్తులను యమయాతనగా చిత్రించుకోవడం నాకు నచ్చనిపని."

"అదే పిచ్చితనం ప్రసాద్. అంతా ఆశావాదులు కమ్మంటారేగాని చివరకు ఆశావాదులే నిరాశావాదులుకంటె యమయాతన పడతారు కాలవేగంలో చివరకి."

"నువ్వు అలా అనుకో. ఆశావాదులు జీవితం స్వర్గంలా, వెన్నెల్లా, తేనెలా ఉంచుకుంటారు తమ జీవితాన్ని. నిరాశావాదులు తమ జీవితాలని నరకమయంగా చేసుకుంటారని నేను అనుకుంటున్నాను."

"పోనీలే ఇది నచ్చితే చూడు. నీ అభిప్రాయాలు నీ దగ్గరుంచుకో. ఏ కారణంలేకనే నాతో ఏకీభవించమనను. నా అభిప్రాయాలు బలవంతంగా నీమీద రుద్దేమనిషిని కాదు. నీకేదో ముందు జరుగుతుందని అనుకుంటావు. కాదు

ఊహిస్తావు. నమ్ముతావుకూడా. ఉట్టినే నమ్మి కూర్చోవు. పదిమందికి, చంకలెగరేసి, నీకొచ్చే సిరిసంపదల్ని, అదృష్టాన్ని, చిలువలు పలువలుచేసి, అంతంతమాత్రంగా కాకుండా, వివరించిచెపితేనేగాని నీ ఉబలాటం తీరదు. కాని చివరకు అలాటిదేమి జరగదు. పోతే మామూలుగా ఉంటుంది వర్తమానంలా, భవిష్యత్తుకూడా. ఇంతకంటె అర్ధ్వాన్నంగా ఉండకపోతే అదే పదివేలు. నీవు అనుకొన్నది అనుకున్నట్లు జరుగలేదేమీ అని విచారిస్తావు. క్రుళ్ళిపోతావు. ఇతరులకు చెప్పి బారుమంటావు. నీ అపజయాలను గురించి పెద్ద ఆర్భాటాలు చేస్తావు ఇతరులదగ్గర. చివరన అప్పటి భవిష్యత్తులో ఇప్పటి వర్తమానంకేసి చూస్తావు. దీనిక్రిందే ఉన్నా ఇప్పటికి జరిగిపోయినదానికోసం కూడా వెతకడం చాలాచోట్ల సంభవం. వెనక్కు తిరిగి, పాతను క్రొత్తతో పోల్చి చూసుకోవడం తప్పనిసరి. జరుగుతున్నది ఎలానూ జరిగినదాని కంటె బాగుంటుంది. ఏదో చెప్పాను బాగుంటే..."

"బాగుంది నీ వాదన. ఎవరయినా తమకు చెడు కల్గుతుందని ఊహించుకుంటారా? ఎప్పుడో చెడు కల్గుతుందని ఇప్పుడు విచారించడం వివేకవంతుల లక్షణమా?"

రామం అందుకున్నాడు- "దారికి వచ్చావు. ఆఁ! అందుకే. ముందు పెద్ద ఒరిగేదుందని ఊహించకు. అప్పుడే విచారించవలసిన అవసరం ఏ విధంగానూ కలగదు. ఎప్పుడో ఏదో పెద్దగా జరగపోతున్నదని పెద్ద ఆశలు పెట్టుకొని, అపుడు జరక్కపోతే (ఎలాగూ జరగవు అవి పేకమేడలు కనక) అప్పుడు క్రుంగి కృశించడంకంటె జరగదనుకొని సాక్షిగా ఉండటం మంచిది కాదంటావు?"

"అంటే ఎప్పుడూ నిరాశగా ఉండాలంటావు. మనకేం ముందొరగదని నిశ్చయించుకోమంటావు కదూ రామం?"

"అపుడు ఖర్మంచాలక నీకెదయినా జరిగితే సంతోషించు. నీకెదయినా మంచి జరుగుతే ఎలానూ సంతోషిస్తావు ఒకరు చెప్పక్కర్లేదు. కాని ఒకటి - అపుడు చెడు జరిగిందనుకో వెంటనే క్రుంగి కృశించవు. 'ఇలా జరిగిందేమిటా?' అని ఆశావాదిలా... ఏమంటావు ప్రసాద్?"

"నాకేం తెలియకుండా వుంది. ఏమో! కొన్నాళ్ళు కావాలి ఈ విషయాలు అర్థంచేసుకోడానికి" అని ఊరుకున్నాడు ప్రసాద్.

---

స్కెచ్

# నడక సాగింది—

జోశ్యుల సూర్యనారాయణమూర్తి

"ఈ కాఫీ నేను కలుపుతానుగాని పిల్లవాడి నేడిపించక వాడికి ముందు పాలియ్యి."

"అంతమాత్రం మీకోపిక ఉంటే యికనేం?"

"అలా అనకు. ఇవ్వేళనుంచి చూడు. నేనెంత ఓపిక చూపుతానో!"

"అయితే రేపటినుంచి సూర్యుడు పడమట ఉదయిస్తాడేమో?"

"ఆ పని జరగాలంటే ముందు నీ విసుగు తగ్గాలి."

"నేనేమీ శాంతిమంతురాలినని చెప్పుకోవటం లేదు."

"అయితే నీవు వసంతవెందుకవుతావు? శాంత కుమారివయ్యేదానవు."

"పేరుకేంలెండి! మీ పేరులో ఉన్న మధువు మీ మాటల్లో వెదకినా కనబడదు."

పై సంభాషణ ఆ దంపతుల మధ్య జరిగి యిప్పటికి దాదాపు సంవత్సరమయింది. నిజంగా ఆనాడు వసంతకుగాని మధుకిగాని ఓర్పు తక్కువే. కాని యీ సంవత్సరంనుంచీ పిల్లవాడెదిగి రోజుకొక రకంగా పెంకితనము, అల్లరి జాస్తీచేసేసరికి వాడితో వేగలేక మొదట్లో వాణ్ణి జయిద్దామని ప్రయత్నించినా ఇప్పటికి వాడిచేతిలో వీళ్ళే ఓడిపోయారు. చిన్నపిల్లలముందు పెద్దవాళ్లు అందులో ముఖ్యంగా తల్లిదండ్రులు యెంతో ఓర్పుతో మెలగాలి. ఎంతో అనుభవం వున్నవాళ్లుగాని వాళ్ళ మన